ఘనంగా క్రిస్మస్ వేడుకలు



రొద్దం గుడ్ షెపర్డ్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ రూప



పెనుకొండలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న పాస్టర్ గోపాలరెడ్డి

లేపాక్షి: లేపాక్షి గ్రామంలోని గ్రేస్ జీసస్ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ పర్వదిన సందర్భంగా బుధవారం ఉదయం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం పాస్టర్ ప్రకాష్ ఏసుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. గ్రామ సర్పంచ్ ఆదినారాయణ క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కల్లూరు, శిరివరం, మానేపల్లి, కంచిసముద్రం తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

పావగడ: పట్టణంలోని ఆర్ఎంసీ యార్డు సమీపంలో ఉన్న ఇవాంజెలికల్ హార్వెస్ట్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. చర్చి పాస్టర్ ఎంజీఆర్ అభిషేక్ రాయ్ క్రీస్తు సందేశానికి భక్తులకు వినిపించారు. అనంతరం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

అగళి: క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు బుధవారం వేకువజామునే పవిత్ర స్నానాలను ఆచరించి, నూతన వస్త్రలను ధరించి స్థానిక న్యూకోవినెంట్ చర్చికు తరలివెళ్లారు.క్రీస్తు గీతాలను ఆలాపించటంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో పాస్టర్ ఆనంద ప్రత్యేక ప్రార్థనలు జరిపి, దైవ సందేశం వినిపించారు. అనంతరం కేక కట్ చేశారు.అన్నదానం ఏర్పాటు చేశారు. పేద మహిళలకు సిస్టర్ ప్రతిభ చీరలు పంపిణీ చేశారు.

పెనుకొండ: దేవదూత ఏసు ప్రభువు చల్లని దీవెనలు ప్రజలపై ఉండాలని, ప్రపంచ వ్యాప్తంగా శాంతి నెలకొనాలని షాలేము ప్రార్థనా మందిరం పాస్టర్ గోపాలరెడ్డి పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని షాలేము మందిరం, సీఅండ్ఐజీ మిషన్ చర్చి, బైబిల్ మిషన్ చర్చి, హోరేబు ప్రార్థనా మందిరం, సీయోను చర్చి, జిప్సి హాస్టల్‌లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు పెద్దయెత్తున చర్చిల వద్దకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు.



హిందూపురం సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

క్రీస్తు జననం.. శాంతికి సందేశం

హిందూపురం టౌన్: ఏసు ప్రభువు జననం శాంతికి సందేశమని పాస్టర్లు అన్నారు. బుధవారం పట్టణంలో క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా చర్చీల్లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిల్లో భారీ కేక్‌ను కట్ చేశారు. అలాగే సీఅండ్ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చి, పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న చర్చీల్లో చర్చి కమిటీల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థలనలు నిర్వహించారు. సాయంత్రం చర్చిల వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాస్టర్లు ఫ్రాంక్లిన్, సుధాకర్, జాన్ ప్రియనాథ్, స్టాన్‌లీ, గోపాల్, క్రిష్టఫర్ తదితరులు ఆయా చర్చిల్లో క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా క్రైస్తవురులు బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బేతాళం చర్చి, మిషన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆయా చర్చిల్లో పాస్టర్లు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలతో పాటు చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు చర్చిల వద్ద భోజన సదుపాయం కల్పించారు.

రొద్దం: మండల కేంద్రంలోని నాలుగు చర్చిల్లో కిస్మస్ వేడకులను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు ఏస్తుకీస్తు పాటలు ఆలపించారు. ఆర్. మరువపల్లి చెక్‌పోస్టు, ఎమ్మార్సీ భవనం ఎదుట, రొద్దం–హిందూపురం ప్రధాన రహదారిపై ఉన్న చర్చిల్లో వేడుకలు నిర్వహించారు. రొద్దం గుడ్ షెపర్డ్ చర్చిలో పాస్టర్ యలిపాజ్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ రూప కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఆర్పి రవిశేఖర్‌రెడ్డి, పెద్ద ఎత్తున క్రై స్తవులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరపుకున్నారు. స్థానిక సీఅండ్ ఐజీ మిషన్ చర్చిలో క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇదిలా ఉండగా కిస్మస్ సందర్భంగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు వైటీ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ తిప్పేస్వామి, సుధాకర్, ఈరన్న, మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రొళ్ల: కె.బ్యాడగెర గ్రామంలోని ఇమ్మానువేల్ ప్రార్థన మందిరంలో బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎం.రాయాపురం, గొట్టుగుర్కి, రొళ్ల, కొడగార్లగుట్ట కాలనీ, టీడీపల్లి, వన్నారనపల్లిలో కూడా వేడుకలు నిర్వహించారు. పాస్టర్లు బ్రదర్ జేమ్స్, దేవకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకలకు హాజరైన వారికి అన్నదానం చేశారు.

అమరాపురం: ప్రపంచ మానవళికి యేసు ప్రభువు రక్షకుడని పాస్టర్లు శ్రీనివాస్, ప్రకాష్‌రావు, సుందర్‌రాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని షాలోమి, బెరాకా, కపేర్నహోం ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. మతపెద్దలు పుట్టోజీరావు, కిరణ్‌కుమార్, జయకుమార్, నారాయణ, సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: గుట్టూరు, మావటూరు, నాగలూరు, మరువపల్లి చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు.

పరిగి: మండల వ్యాప్తంగా బుధవారం క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్రీస్తు ప్రార్థనా మందిరం, సీఅండ్ ఐజీ, బైబిలు మిషన్ చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. శ్రీరంగరాజుపల్లి, బీచిగానిపల్లి, పరిగి, మోదా, ఊటుకూరు, కొడిగెనహళ్లి తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనల అనంతరం అన్నదానం చేపట్టారు. పాస్టర్లు రెవస్ సుధాకర్, రామాంజినప్ప, అబ్రహం పాల్గొన్నారు.



లేపాక్షిలో క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ ప్రకాష్



అగళిలో చర్చిలో మహిళకు చీర అందిస్తున్న దృశ్యం



అమరాపురం కపేర్నహోము మందిరంలో అన్నదానం



నాగలూరు బైబిల్ మిషన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ లూకాబాబు



శ్రీరంగరాజుపల్లిలో ఏసుక్రీస్తు గేయాలాపన చేస్తున్న కళాకారులు



మడకశిర సీఐజీ చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్ షాలిమ్‌దాస్



రొళ్ల మండలం కె.బ్యాడిగెరలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



పావగడలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



సోమందేపల్లిలో చిన్నారుల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దీపిక

లేపాక్షి: కోడిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆనందప్ప మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గం ఇన్‌చార్జ్ టీఎన్.దీపికతో పాటు వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు నిస్సార్, శ్రీనివాసరెడ్డి, రామాంజి, రుద్రప్ప, లక్ష్మినారాయణరెడ్డి, వేమయ్య గ్రామానికి చేరుకుని ఆనందప్ప మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీపిక మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి ఆర్థికసాయం అందించారు.

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వి మాదేశ్

పావగడ: సమాజంలో మానవ హక్కుల ఉల్లంఘన కాకుండా ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలని స్థానిక జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం సీనియర్ న్యాయమూర్తి వి మాదేశ్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన విశ్వ మానవ హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సమానతను కాపాడడానికి అన్ని సామాజిక వర్గాలు కృషి చేయాలన్నారు. మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ తాలూకా అధ్యక్షుడు ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులు,కర్తవ్యాలను తెలుసుకోవాలన్నారు. తద్వారా మానవ హక్కుల ఉల్లంఘన నిర్మూలించడం సాధ్యమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మురళీధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ శేషానందన్ , కార్యదర్శి ప్రభాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: మండల కేంద్రంలోని బీరలింగేశ్వర కళ్యాణ మండపంలో బుధవారం తిరుమలదేవర పల్లి గ్రామానికి చెందిన శివప్ప కుమార్తె గంగోత్రి వివాహం అశోక్‌తో జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల ఎస్ఐగా వీరాంజనేయులు



రొళ్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం నూతన ఎస్ఐగా వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి జిల్లా కేవీబీపురం పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. ఏఎస్ఐ బాలాజీ, పోలీస్ సిబ్బంది నూతన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ఆలయంలో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభం

అమరాపురం: బంగారుపాళ్యం గ్రామానికి వెళ్లే రహదారిలో వెలసిన బెనవన్న ఆలయం ఆవరణలో బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్టాపన జరిగింది. ముందుగా ఆలయ అర్చకుడు అశ్వర్థనారాయణశాస్త్రి ఆలయంలో వివిధ పూజలు, హోమాలు చేపట్టారు. అనంతరం జేసీబీతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అగళి: ఆర్‌జీ పల్లి శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురుని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. నిందితుల నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

'పోరుబాట'ను జయప్రదం చేయండి



పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుడిబండలో పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

చిలమత్తూరు: విద్యుత్ చార్జీల పెంపుపై తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ నేత రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే మూడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన సీఎం చంద్రబాబు పేదల సొమ్ము దోచుకుంటున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదరికాన్ని పారదోలేందుకు ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు కొనసాగించకపోగా, ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రజలను మోసగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్జీల బాదుడుపై హిందూపురంలో శుక్రవారం జరిగే పోరుబాట కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీటీసీ సభ్యుడు రాఘవేంద్రరెడ్డి, మాజీ మండల కన్వీనర్ మద్దిపి లక్ష్మీనారాయణ, శంకర్‌రెడ్డి, నయిముల్లా, నవాబ్, శ్రీనాథ్‌రెడ్డి, భాస్కర్, రామచంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మడకశిరలో శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి ఏకంగా రూ. 15 వేల కోట్లకు పైగా ప్రజలపై భారం మోపుతుందని ధ్వజమెత్తారు. పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూతరాజు, సర్పంచ్ జగదాంబ క్రిష్టప్ప, నాయకులు గిరిధర్, రంగదామ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిరలో శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జమ్మానిపల్లి నరసింహమూర్తి కోరారు. ఆయన బుధవారం సాక్షితో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రజలకు హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి రాగానే ఈహామీని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలకు గాలం వేసి అధికారంలోకి రాగానే ప్రజలను సూపర్‌గా మోసం చేశారని ఎద్దేవా చేశారు. పోరుబాట నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మండల పూజ

మడకశిర: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి మండల పూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. ముందుగా ఆలయం ఎదుట ధ్వజస్తంభ ప్రతిష్టాపన చేపట్టారు. అనంతరం అయ్యప్పస్వామికి వివిధ రకాల అభిషేకాలు, పూజలు చేపట్టారు. అయ్యప్ప మాలధారుల భజనలతో ఆలయం మార్మోగింది. గోవింద మాలధారులు కూడా ఈపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ ప్రముఖులు,ప్రజా ప్రతినిధులు,అధికారులు కూడా ఈపూజా మహోత్సవంలో పాల్గొన్నారు.భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంకాలం పట్టణంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని వెండిపల్లకీలో ఊరేగించారు.

పరిగి: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం ఆయ్యప్ప మాలధారులకు పరిగి పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు అన్నదానం చేపట్టారు. తన కుమారుడు నాగచైతన్య పుట్టిన రోజును పురస్కరించుకుని అయ్యప్ప భక్తులకు అన్నదానం చేపట్టినట్లు శ్రీనివాసులు తెలిపారు. ఈసందర్భంగా హెచ్‌సీ శ్రీనివాసులు కుటుంబాన్ని గురుస్వాములు సత్కరించారు. ఎస్ఐ రంగడుయాదవ్, ఏఎస్ఐ వెంకటేశులు, గురుస్వామి పూల నరసింహప్ప, కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదర్శప్రాయుడు అటల్ బిహారీ వాజ్‌పేయి

మడకశిర: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి అందరికీ ఆదర్శప్రాయుడని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా వాజ్‌పేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను కొనియాడారు. నాయకులు దొడ్డరంగేగౌడ్, గుప్తా, వెంకప్ప,సుబ్బరాయుడు, నారాయణప్ప, భానుదాస్, లక్ష్మీనారాయణ, నరసింహప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం అందరికీ ఆదర్శమని దివ్య ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్టు చైర్మన్, బీజేపీ నేత పరిగి వేణుగోపాలరావు అన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయ్ శత జయంతి సందర్భంగా మండలంలోని విద్యానిధి జూనియర్ కాలేజ్‌లో వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా వాజ్‌పేయ్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ప్రిన్సిపాల్ ఎల్లారెడ్డి, నాయకులు అశ్వర్థ, కార్తీక్, ట్రస్టు మేనేజర్ కొండూరు శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాజ్‌పేయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

హిందూపురం టౌన్: విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని వక్తలు అన్నారు. పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం ఆవరణలో సామ టెక్నాలజీస్ ఫౌండర్, సీఈఓ కట్టా సురేష్‌బాబు సహకారంతో నూతన భవన సముదాయాన్ని నిర్మించారు. బుధవారం కట్టా సురేష్‌బాబు తన సతీమణి రాధా, తల్లి సరోజమ్మతో కలిసి భవనాన్ని ప్రారంభించారు. వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, ఐడీబీఐ మేనేజర్ శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జేపీకే రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన విద్యను అందించడం సరస్వతీ విద్యా మందిరం గొప్పతనమన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ముఖ్య వక్తఎస్‌టీ అశోక్ కుమార్ ఒక వ్యక్తి సమాజంలో ఏ విధంగా ఎదగాలి, దేశాన్ని ఏ విధంగా రక్షించుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా విద్యారణ్య ఆవాస విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఉన్నత పాఠశాల అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, సత్యసాయి జిల్లా కార్యదర్శి కేపీ రాధాకృష్ణ, పాఠశాల కార్యదర్శి వెంకటరాములు, ప్రధానాచార్యులు అశోక్ కుమార్, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.



సరస్వతీ విద్యామందిరం భవనాన్ని ప్రారంభిస్తున్న దాత కట్టా సురేష్‌బాబు

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుకొండ రూరల్: హరిపురం సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. విజయవాడుకు చెందిన రవితేజ తన కారులో వెళ్తుండగా హరిపురంలో సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో గాయపడిన అతడిని స్థానికులు 108లో పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

